
# సృష్టికే అందం




ముక్కింది. మూల్గింది. ముందుకు సాగినట్లు సాగింది. ఆగినట్లు ఆగింది!

ఆగిందనుకొనేసరికి ఆర్భాటాలు చేస్తూ ఆవేశపడింది. ఆవేశంలో ఎగిరెగిరి పడింది. ఎత్తేసింది. కాసేపు కళ్ళెంలేని గుర్రంలా పరుగులు తీసింది. కాసేపు నత్తలా మెత్తగా నడిచింది. గంటలోపుగా ఇన్ని విపరీతమైన చేష్టలు ఇష్టమొచ్చినట్లు ప్రదర్శించి 'ఇక చాలురా బాబూ!?' అనుకొనేసరికి స్తబ్దంగా నిలబడిపోయింది!

అదే ఆర్టీసీ బస్సు ప్రత్యేకత!

తిరుపతిలో బయలుదేరి శ్రీ కాళహస్తి చేరేలోపుగా ఇంత అనుభూతిని కలిగించడంలో దానికదేసాటి! అదే ఆలోచిస్తూ నిలబడిన బస్సు నుండి దిగడానికి లేచి నిలబడ్డాను. 'కుంయ్! కంయ్!' మంటున్న సోడా అరుపులు... రిక్షాల పలకరింపులు... తినుబండారాల రేట్ల వివరాలు... నిలబడిన బస్సును నిలువునా ముంచేస్తున్నాయి. చెవులు దిమ్మెక్కిపోతుంటే చేసేదిలేక బస్సుదిగే ప్రయత్నంలో అభిమన్యుడు గుర్తుకొస్తున్నాడు. ఓ ఆసామి సగం కొరికిన చుక్కరటి పండును

చేతబట్టుకొన్నాడు. బస్సు ప్రదక్షిణం చేస్తున్నాడు. వినబడీ వినబడినట్లు గొణుక్కోవడం, వికృతంగా చూడడం, కాసేపు వేగంగా, కాసేపు ఊగుతూ నడవడం, నిలబడలేక తూలడం, అతని చేష్టల్నీ గమనిస్తూంటే ఆర్టీసీ బస్సును మతికి తెస్తున్నాయి. గురుడు చుక్కేసినట్లుంది. తాగిన వాడికి ఆర్టీసీ బస్సుకు సమన్వయం కుదిరేసరికి నాలో నేను సన్నగా నవ్వుకొన్నాను. అంతవరకు ఎదురుసీట్లో ఒదిగి కూర్చొన్న ఓ సన్నజాజి బస్సు ఆగేసరికి లేచి నిలబడింది. తొక్కులాటలో చిక్కి నలగడానికి ఇష్టపడనట్లుగ అందమైన ముఖాన్ని ఆరువంకర్లు తిప్పింది. చుక్కేసిన చుక్కరటిపండు చేష్టలు, ఆర్టీసి బస్సుతో సమన్వయం కుదిరి, సన్నటి నవ్వు నాపెదాలపై విరబూస్తే విరబూయడం 'సన్నజాజికే' పరిమితమైన హక్కనుకొని, ఆ హక్కేమో దురాక్రమణ అయినట్లు భావించి పాపం! సన్నజాజి కొరకొర చూసింది.

"ఏమయ్యా? కళ్ళు కనబడడం లేదా? ఒళ్ళు చెప్పినమాట వినడం లేదా? ఎందుకలా పైన బడతావు? ఏం కొంపలు మునుగుతున్నాయని ఆ తొందర?" తన తొందరపాటును గ్రహించలేని ఓ మహిళ పైనపడబోయిన ఒక వ్యక్తిపై విరుచుకపడింది.

"తల్లీ! ఆమాట నన్నడిగితే లాభమేమి? ఎవడి తొందర వాడిది? నన్ను ముందుకు నెట్టుతున్న నా వెనుకనున్న గుంపు నడుగు. ఇంతమందిని ఉప్పుమూటల్లా ఈ బస్సులో కుక్కిన కండక్టరును అడుగు. ఆర్టీసీ అధినేతల్నడుగు!"

బస్సు రంగస్థలంమీద బ్రహ్మాండంగా రక్కికట్టింది వాచకం. వాలకం గమనిస్తే నాటకాల రాయుణ్ణి తలపింపచేస్తున్నాడు.

బస్సు గలగల మంది మళ్ళీ కదలడానికేమో?

"హోల్డాన్! హోల్డాన్!" కండక్టరు అరుస్తున్నాడు.

ఆ వ్యక్తి ఆగేటట్లులేదు.

"అక్కడ ఆ సభల్లోనేఁ వో....'హక్కులు, మహిళల హక్కులు!' అని గొంతు చించుకొని ఎవరో ముందుకు పోనీకుండా పగ్గాలేసి పట్టినట్లు పరితపించి ఇక్కడ ముందు పడడానికి ముక్కితే ఎట్లాగండీ?" ఖద్దరు కండువా సర్దుకోవడం తన మాటలు నలుగురు వింటున్నారా లేదా? అని దిక్కుల్ని చూపులతో గాలించడం అతని ధోరణి అతనిదిగా ఉంది.

ఈమారు సన్నజాజి కూడా సన్నగా నవ్వింది.

'సన్నజాజినవ్వింది! సన్నజాజి నవ్వింది!' అంటూ మనసు తైతక్కలాడితే కాళ్లకు ఊపు వచ్చింది. సైనిక వందనం స్వీకరించే ప్రధాని కండక్టరైతే నేను సైనికుడి హోదాలో బస్సుదిగాను.

నాలుగుచక్రాల బండ్లమీద బద్దలుగా కోసిపెట్టిన పుచ్చపండ్లపై ఈగలు పిచ్చిగా ముసురుతున్నాయి. వేసవికాలానికి స్వాగతం చెబుతూ వడగాల్పులు గూబలు అదరకొడుతున్నాయి. రిక్షావాళ్లు! 'రిక్షాసార్! రిక్షాసార్!' అంటూ నన్ను ముసురుకొన్నారు. కర్రకు గట్టిన గుడ్డతో కరిబూజ పండ్లపై వాలుతున్న ఈగలను తరిమినట్లు, వట్టివేళ్ళ విసనకర్రతో వడగాల్పులను మందలించినట్లు, చేతిరుమాలు ఆయుధంగా రిక్షావ్యూహాన్ని ఛేదించుకొని బయటపడ్డాను.

సన్నజాజి మనసులో మెదిలితే ఒక్కక్షణం నిలబడ్డాను. కదలిపోతున్న ఆర్టీసీ బస్సును చూశాను. నిరాశను కళ్ళల్లో నింపుకొంటున్న రిక్షావాళ్ళను చూశాను. మహిళా ప్రగతి నినాదాలకు కొత్త కొత్త అర్థాలు తీసిన ఖద్దరు కండువాను చూశాను. సన్నజాజి ఎప్పుడు జారుకొనిందో చల్లగా జారుకొనింది. ఓ నిట్టూర్పుతో మనసు కుదుట పడ్డే చూపు పరిసరాల మీదికి ప్రాకింది. పొద్దువాలింది. స్వర్ణముఖి నదిలో తెల్లటి ఇసుకపై తేలి ఊరిమీద పడి, బంగారు కాంతుల్ని చల్లుతూఉంది. ప్రకృతి వెదజల్లుతున్న అందచందాలు తికమక పడుతున్నాయి– తీరిక, కోరిక లేని మానవాళి దృష్టిని ఆకట్టుకోలేక! అయితే నా దృష్టిని అకట్టుకొన్నది మాత్రం ఒక రిక్షావాడు.

రిక్షాల గుంపునుండి వెలివేసినట్టు ఆ మలుపులో కాస్త దూరంగా వాడూ వాడి రిక్షా! ఆ రిక్షా వాడిబతుకుకాధారం. ఎండలో కానీ, వానలో కానీ కాస్త సందు దొరికితే ఆ ఎముకల గూడు సేద దీర్చుకోవడానికదే ఆశ్రయం. అందుకేనేమో? రెండు మోచేతుల్ని హేండిల్‌బార్‌పై ఊనుకొని ఎటో చూస్తున్నాడు.

సగం అల్లి వదలిన పిచ్చుక గూడులా ఉంది గడ్డం. కలిగిన మహానుభావుడెవరో ఏవగించుకొని ఎటో పారేసిన కుళ్ళాయి వాడి తలమీద పడి సగర్వంగా నిలబడింది– తనజన్మ సార్థకత చెందినట్లు. 'నేనే అడ్డమే లేకుంటే ఎవరైనా లెక్క పెట్టవచ్చు నీ ఎముకల్ని, అని మురిసిపడుతూ ఉంది చిరిగిన చొక్కా. పండ్ల మధ్య బిగిసిన తుండుబీడీ కాలి కాలి ఎప్పుడారి పోయిందో నుసిరాలుతూ ఉంది. కానీ కండ్లు మాత్రం దీగూట్లో దివ్వెల్లా మలగడానికి తాపత్రయ పడుతుంటే ఎటో చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు.

బస్సు ఆగింది. ప్రయాణీకులు ఎక్కారు. దిగారు. వ్యాపారస్థులు అరుపులందు కున్నారు. రిక్షావాళ్ళు గోలచేశారు. తప్పించుకొని బయట పడితే చాలునన్న స్థితిని కల్పించారు. ఉన్నట్లుండి ఓ జాతరంత రభస జరిగినా తనకేమీ పట్టనట్లుగా ఉన్న ఆ రిక్షావాడిని చూస్తుంటే ఎందుకో ఓ రకమైన అభిమానం కలిగింది.

"ఏయ్....రిక్షా!"

వాడికి తనదంటూ ఒక రిక్షా ఉండదు. కానీ, తనదైనా తనదికాని ఊరు ఉంటుంది. తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెట్టుకొన్న పేరూ ఉంటుంది. అయినా, వాడిపేరే 'ఏయ్‌రిక్షా!'

గుమస్తాను 'గుమస్తా' అని పిలిస్తే బాధ. డాక్టర్ని 'డాక్టర్' అని పిలవకపోతే బాధ. జానెడు పొట్టకోసం బతుకుతున్న వాడికి మానెడు ఆలోచనలుండవు. ఉండడానికి వీల్లేదు. అందుకే వాడేమీ అనలేదు. అయితే, నోట్లోని తుండుబీడి ముక్క తటాలున చేతికొచ్చింది. ఆపై కాలికింద పడి నలిగింది. వాడు నిటారుగా నిలబడి రిక్షా కదిలించడానికి ముంపుతూ "ఎక్కండి బాబూ!" అన్నాడు.

వీళ్ళతో పేచీపడడం మహాకష్టం కాబట్టి ముందే అడిగాను.

"ఎంతేవుంది? ముప్పయి పైసలు"

ఎక్కడికని వాడు అడగనూలేదు. నేను చెప్పనూలేదు. అయితే మాత్రం ముప్పయి పైసలన్నాడు. అందుకే వాడివైపు ప్రశ్నార్థకంగా చూశాను. వాడు గ్రహించినట్లుంది.

"ఇంకే ఊళ్ళోన్నా అయితే ఏఁవోగానీ- ఈ ఊళ్ళో యాడెక్కి యాడ దిగినా ముప్పయి పైసలే! ఎక్కండి బాబూ!" నా సందేహాన్ని తీర్చాడు.

"చాలా చవకే!." అందామనుకొన్నా స్వార్థం గొంతు పెగల్లేదు.

ఎక్కి కూర్చున్నాను. వాడు ఒక్క ముంపుతో రిక్షా ముందుకు నెట్టి ఆపై ఎగిరి కూర్చుని తొక్కుతున్నాడు.

రిక్షా పోతూఉంది. తూర్పుగాలి తెంపులు తెంపులుగా వస్తూవుంది. వాడు ముందు. నేను వెనుక. వాడు సీటుమీద నుండి బెత్తెడు పైకిలేచి ఊపిరి బిగపట్టి తొక్కుతున్నాడు. తొక్కడం వాడి ధ్యేయం. అయితే వాడితో ప్రేమయం లేకుండా నేనేమో నడుము వాల్చి కూర్చున్నాను. అయితే, నాకే కాస్త యిబ్బందిగా వుంది- చెమటకంపును మోసుకొస్తున్న తూర్పుగాలిని భరించడం. ఓపికపట్టి కూర్చున్నాను. వాడితో మాట్లాడాలన్ని కుతూహలాన్ని మాత్రం చంపుకోలేకపోయాను.

"చూడబ్బీ! బస్సు వచ్చింది. ఎంతోమంది దిగారు. ఆ మలుపులో రిక్షావాండ్లందురూ దాదాపు బస్సును చుట్టుముట్టేసినారు. మరి నువ్వేమో?.... నన్ను ముట్టుకోకన్నట్లుగా ఎందుకలా దూరంగా......?"

నోటిలోమాట నోటిలో ఉండగానే, రిక్షా తొక్కుతూనే ఒక్కసారి వెనక్కు తిరిగాడు. అదోరకంగా చూశాడు. ఇంకోరకంగా నవ్వాడు. యథాప్రకారం రిక్షా తొక్కుతున్నాడు. వాడూ వాడిధోరణి నాలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించింది.

"ఎందుకలా నవ్వుతున్నావు"

"అయ్యా! మీరూ మణిసే! నేనూ మణిసే!" వాడు చాలా వినయంగా అంటున్నా చెంపన 'ఛెళ్ళున' కొట్టినట్లయింది. నిబ్బరించుకొన్నాను.

"అయితే?"

"అయితే మీరు కూసోనుండారు. నేను తొక్కతా ఉండాను. అంతేతేడా? దీన్ని తలరాతన్నారు తమబోటి పెద్దోళ్ళు!"

తల దిమ్మెక్కింది.

"నే నడిగిందేమి? నువ్వు చెప్పేదేమి?"

"మీరడిగింది, నేను చెప్పింది రొండు వొగిటేకదయ్యా!"

"అదెలా?"

"అంటే ఎవురి అదురుష్టం వాళ్ళదే గదయ్యా!"

"అహాఁ!"

"అంతేగదయ్యా! బస్సు వచ్చీ రాకముందే అందురూ ఈగల్లా ముసురుకుం(డ్రి. అయితే అందురికీ బాడిగ దొరికిందా? లేదే....! మరి నాకో? హ్హహ్హహ్హ! దీన్నేగదయ్యా తలరాతనేది!"

మనిషి పెళుసుగా కనిపించినా మాట దురుసుగా ఉంది. దురుసంటే అలా యిలా కాదు. ఏకంగా గుండెల్ని ఒరుసుకుపోయే దురుసు. వాడికీ పరిజ్ఞానం జీవితానుభవంతో అబ్బిందా? లేక ఉన్నవాళ్ళు లేనివాళ్ళ నెత్తిన యుగయుగాలుగా ఈ వేదాంతాన్ని రుద్దుతున్నారా? మనసు తికమకపడ్తూ ఉంది.

"చూడండి బాబూ! బుద్దిలేనోళ్ళెవురో బుద్ధి లేకుండా కలిసి బతికితే నేను పుట్టుంటాను. బుద్దెరగని నాటికత ఏందోగాని కానీ– బుద్ధి తెలిసింది మొదులు బుద్దిగా బతకాలనుకుంటి. మూటలు మోసినా. చెన్నపట్నంలో సవారిబండి లాగినా. ఇప్పుడీ ఊళ్ళో రిక్షా తొక్కతా ఉండాను. నిన్న మొన్నటినుండి కాదు, ఇరవై ఏండ్లుగా. ఎంత తొక్కినా బతుకులో తొక్కుళ్ళు పడలేకుండా ఉండాను. కానీ, సామీ! ఈ ఇరవై ఏండ్లలో నేను చూస్తా ఉండగానే గుడిసెలు మిద్దెలైనాయి. మిద్దెలు మేడలైనాయి. నా బండిలో తిరిగినవాళ్ళు... నా బండిలో అప్పుడు కాలు పెట్టలేనోళ్ళు ఇప్పుడు కార్లల్లో దర్జాగా తిరగతా ఉండారు. దీన్నేంవంటారు?"

"తలరాతా లేదు. గిలరాతా లేదు. తనచేత తనరాత! కష్టపడ్డవాడికి కష్టపడ్డంత!"

ఉన్నట్లుండి నిలిపాడు రిక్షా. కాస్త ఎక్కుడుగా ఉంది. వాడు గసపోస్తూ ఉండడం గమనించి తొక్కలేకనేమో! అనుకొన్నా. కానీ గబాలున దిగాడు. నావైపు తిరిగాడు. కుడిచేయి చూపుడు వేలితో నొసట దట్టంగా పట్టిన చెమట నూడ్చుకొన్నాడు. ఆ వేలిమీదనే చెమటను బొట్లుబొట్లుగా రాలుస్తూ–

"ఇది కష్టంగాదా చెప్పండయ్యా?"

ఏమనిచెప్పేది? అది ఎముకలగూడు ఓడ్చిన చెమటకాదు – నీళ్లని ఎలాచెప్పేది? సమాధానం గొంతులో సతమతమయింది. కనుకొలకులు చెమ్మగిల్లాయి.

ఆ తరువాత మా ఇద్దరిమధ్య మాటలు లేవు.

బస్టాండులో బయలుదేరిన రిక్షా మెయిన్‌రోడ్ మీదుగా సాగి ఒక కూడలివద్ద ఆగింది.

"ఎట్టపొమ్మంటారయ్యా?" అప్పుడడిగాడు వాడు.

"తాలూకాఫీసుకు పద!" అన్నాను.

రిక్షా పోతూఉంది. ఒక్కరిక్షా మాత్రమేనా! రిక్షాతో కలిసి లోకమే పోతున్నట్లుంది. ఎవరిదారి వాళ్ళదిగా. ఎవరి బతుకులు వాళ్ళవిగా. అప్పుడు లోకాన్ని చూసే శక్తి లోపించింది నాలో. రిక్షావాడివైపే చూస్తున్నాను. తూర్పుగాలి ఎటు కొట్టుకుపోయిందో పోయింది. వాడి వేషానికీ, భాషకు, భావానికీ ఆమడల దూరముందే? జీవితావగాహన శక్తి ఇంకాపైనుందే! అని ఆలోచిస్తున్నాను.

రిక్షా తాలూకాఫీసు ముందు ఆగింది.

రిక్షా ఆపుచేసి వాడు దిగాడు. నేనూ దిగాను. దిగుతూనే వాడు మళ్ళీ కుడిచేతి చూపుడు వేలితో నొసపట్టిన చెమట తుడుచుకొన్నాడు. చూపుడు వేలిమీదుగా ఆ చెమట ఒక్కొక్క బొట్టుగా నేలరాలుతూ ఉంది. ఒక్కొక్క బొట్టు వేయిగొంతులై 'ఇది కష్టంకాదా? ఇది కష్టంకాదా?' అని నిలదీస్తున్నాయి. ఈ సారి మాత్రం వాడు నన్ను చూడనేలేదు. చిరిగిన ఆ చొక్కానే కాస్త పైకిలాగి వదులు చేసుకొని ఒంటిమీద పట్టిన చెమటను తుడుచుకొంటున్నాడు. వాడిని చూడలేక పక్కకు తిరిగాను. జేబులో చేయి వేశాను. ఒక్క పదిరూపాయల నోటు చేతికి తగిలింది. తీసి వాడి చేతికిచ్చాను. చూపుల్లో సందేహం తొంగి తొంగి చూస్తూఉంటే చేతికి తీసుకొన్నాడు. చుట్టు పక్కల కలయచూశాడు. ఆ మీదట తెపరాయించుకొన్నాడు. రిక్షా సీటును సమీపించాడు. నేను ఆశ్చర్యంగా వాడినే పరిశీలించి చూస్తున్నాను.

రిక్షా సీటుకు రెండుసార్లు చేతులెత్తిమొక్కాడు. ఆమీదట సీటుమధ్య భాగాన కాన్వాసు కింద దాచిన పైకాన్ని బయటికి తీశాడు. నాకు ఆశ్చర్యమేసింది. అదెలా సాధ్యపడిందని పరిశీలించి చూశాను. సీటు మధ్య భాగాన కాన్వాసుకు మూడంగుళాల వెడల్పు కాటేసినాడు. దానిమీద కూర్చుంటే కాన్వాసుమీద కాటున్నట్లే తెలియదు. నిదానించి చూసి ఆ సందును వెదకి పట్టుకొని అందులో పైకం దాచడమో తీయడమో చేయాలి. నిక్కరు జేబులు రెండు. చిరిగిన చొక్కాకొక జేబుఉండికూడా వాడితీరు నాకు లేని కుతూహలాన్ని కలిగించింది.

"ఇంకెక్కడ చోటేలేనట్లు కూర్చునే సీటుకింద దాచావేం డబ్బును?"

"ఏం జెయ్యమంటారు సామీ! ఇదేవో సొంతబండి కాకపాయ. పూటకు మూడు రూపాయలు వంతన బాడిగ కట్టాల. లేకుంటే ఓనరు మక్కెలిరగదంతాడు. లేదా బండక్కడే పెట్టు అంటాడు. ఈ పూటతో బాడిగ్గట్టి మూన్నాళ్ళయింది. ఇంట్లో ఆడది ముద్ద ముట్టి మూన్నాళ్ళయింది. ఎక్కణ్ణుంచి వచ్చిందో మాయదారి రోగం. మాలాంటి పేదోళ్ళ బదు కుల్నే ఎతుక్కోనొస్తుంది. డాక్టరు బాబుకు పది కట్టాల. మూన్నాళ్ళ నుండి ఆ పది కోసరం కన్నగసాట్లు పడతాఉండా! ఏం చెయ్యమంటారు చెప్పండి. పైసా పైసా కూడేస్తే కూడా పది కానంటాఉండాది. ఈ లోపల ఓనరు కంట్లో పడ్తే పోలీసోళ్ళు దొంగను సోదాచేసినట్లు చేస్తాడు. అందుకే బాబూ ఈ దొంగ సచ్చిన యవ్వారం!" వాడి గొంతు రుద్ధమైపోయింది. వాడి ఆవేదనలో అభిమానం కొట్టొచ్చినట్లు కనిపించింది.

బాధ్యత ఒక్కొక్కసారి మనిషిని ఎలా తప్పుదారి పట్టిస్తుందో ఆలోచిస్తున్నాను.

ఇంతలో ఆఫీసులో పనిచేస్తున్న మిత్రుడొకడు కనిపించడం. కుశల ప్రశ్నలు కురిపించడం. ఆ ముందు ముందటి రోజు నా బుర్రకథా ప్రదర్శన ప్రసక్తితో మురిపించడం. అప్పటి నా మనోస్థితిని పూర్తిగా మరిపించడం జరిగితే– రిక్షావాడు చేతికిచ్చిన డబ్బును చేతపట్టుకొని ఆ మిత్రునితో కలిసి మాట్లాడుతూ ఆఫీసులోనికి వెళ్ళాను. ఏదో పర్మిట్టుకు సంబంధించిన వ్యవహారం. గంట వ్యవధిలోపల ముగిసింది. పని ముగించుకొని బయట పడ్డాను. అప్పటికి కానీ రిక్షావాడు వాపసు ఇచ్చిన చిల్లర డబ్బు సంగతి మతికి రాలేదు. లెక్కపెట్టి చూద్దునుగదా? సరిగ్గా తొమ్మిది రూపాయలే ఉన్నాయి. అంటే ఒక్కరూపాయి కొట్టేశాడన్నమాట. మనస్సు చివుక్కుమనింది.

దెబ్బయిపైసలు పోయాయని కాదు. మనిషి మాటకు– చేతకు సామ్యమే లేకుండాపోతూఉందే ఈ కాలంలో అని!

వద్దనుకునే కొద్దీ అదే ఆలోచన. అదేచిత్రం. అవిపైసలే కావచ్చు. రూపాయలే కావచ్చు. డబ్బు డబ్బే. మనిషిమీద దానిప్రభావం చిత్రమైంది. ఎంతటి వాడిని అయినా చేయి పట్టి బురదతొక్కించే శక్తి దానికి ఉంది. లేకుంటే పైసలకోసరం నా మనసు పరిపరివిధాల పోతుందా?

“ఔరా! రిక్షావాలా! ఎంత చక్కగా నటించావురా? అందరూ ‘రిక్షా! రిక్షా!’ అని పైపై పడుతూంటే నువ్వు పట్టించుకోకుండా దూరంగా కూర్చున్నావే? అని అడిగితే అదృష్టాదృష్టాల ప్రసక్తితో నోరుమూయించి కోరికలకే అతీతుడైనట్లు మాట్లాడావుగదరా! ‘ఎంత ఇమ్మంటావురా?’ అంటే ‘ఈ ఊళ్ళో ఎక్కడెక్కి మరెక్కడ దిగినా ముప్పయి పైసలే సామీ!’ అని ముంగాళ్ళకు బంధమేశావు గదరా! దాని తాడుదెగ కర్మ సిద్ధాంతమే తారుమారయిపోయినట్లు ఎంత చక్కగా నాటకమాడావురా! రోగమంటివి. డాక్టరంటివి. ఓనరుకి భయపడి డబ్బు దాస్తున్నానంటివి. నీ మాటలు.... మాటలకు తగిన చేతలతో మనస్సే కరిగించితివిగదరా! ఒరే మేధావీ! ఎంతటి అనుభవాన్ని గడించావురా పెట్టుబడిగా మోసానికి?” ఆలోచించే కొద్దీ బీరకాయ పీచులా ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. రిక్షా ఎక్కాలంటేనే అసహ్యంగా ఉంది. అందుకే నడుస్తున్నాను. బస్సుస్టాండు ఎప్పుడు చేరుతామా?” అన్న ఆతురతతో వంచిన తల ఎత్తకుండా నడుస్తున్నాను.

‘అయ్యా! అయ్యా!’ అన్న అరుపు. ఆ అరుపును వెంబడిస్తూ రిక్షా గంట ఉన్నట్లుండి చెవినిపడ్డాయి. ఆ గొంతు పరిచితమైనదని తోస్తున్నా ఇంకా భ్రమలోపడి కొట్టుక పోవడం ఇష్టంలేక నడుస్తున్నాను.

“అయ్యా! మిమ్మల్నే అయ్యా! మిమ్మల్నే” ఆ అరుపు దగ్గరవుతూ ఉంది. అనుకోకుండానే తిరిగి చూశాను.

అశ్చర్యం. వాడే! ఆ రిక్షావాడు!!

రొప్పుతూ రోజుతూ రిక్షా తొక్కుకుంటూ వచ్చి నాముందు రిక్షా నిలిపాడు. రిక్షానుండి ఒక్కసారిగా కాళ్ళపై పడబోయినంతపని చేశాడు, ‘మన్నించండి బాబూ’ అంటూ.

మాటలూచేతలుడిగి వాడి వైపే చూస్తూ నిలబడ్డాను. నా వైపు చూడలేనట్లుగ తల వంచుకున్నాడు. గస ఎగ్గొట్టుక వస్తూ ఉంది. నా ఎదురుగా వాడు. వాడి ఎదురుగా నేను. రెండు నిముషాలు మా ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది. మెల్లగా తల పైకెత్తాడు. వాడి మొగాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. కన్నీళ్ళను ఆపుకోవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నాడు.

‘అయ్యా! పది రూపాయలు ఒక్కసారిగా చేతిలోపడేకుందికి ఒళ్ళు మర్సిపోతి. మంచానికి కర్సకపోయ్న పెళ్ళాం. పది రూపాయలు లేకుంటే మందేలేదని యిర్సకపణ్ణె డాక్టరు కండ్లముందు మెదిల్తే కండ్లు బూసులుకమ్మె! ఎప్పుడో నిన్నియ్యరవకాడ తాగిన దోసిడు సద్దినీళ్ళు. మీకెం తెచ్చినానో? ఏంవో కూడా సూసుకోకుండా పరిగెత్తితి. డాక్టరు కాళ్ళమింద పడ్తి. మారాజు

రాసిచ్చిన మందు కొనుక్కొనిపొయ్ పెళ్ళాం గొంతులో పోస్తి. మీరే సెప్పండి బాబూ! నమ్ముకున్న ఆడది. దానికి నేను. నాకు అది. అప్పటికి నిమ్మళించింది నా మణుసు. లెక్క జూసుకుంటే మీకు సిల్లర డబ్బు వాపసియ్యలేదని తేలింది. అంతే! పరుగో పరుగు! తాలుకాపీసుకుపోతి. అక్కడ లేదన్రి. ఊరు మూడు చుట్లేసుకొని వస్తాఉండా! సత్తింగా– నా ఆడదానితోడు. దోవలో రొండు మూడు బాడిగలొస్తే కూడా వదులుకోనొస్తాఉండా!" అని అమాంతంగా కాళ్ళమీద పడబోయాడు.

"ఆ పని చేయవలసింది నువ్వా? వాడా?" మనసు నోరుచేసుకొనింది.

నిజంగా నేనైతేకూడా ఆ పని చేయడానికి అంతస్థు అడ్డుపడింది. 'ఆత్మ సౌందర్యం లేని నీ అంతస్థులు కాల్చనా?' అని మనస్సు వికలమయితే తల వాలిపోయింది– వాడిని సూటిగా చూడలేక!

"ఫరవాలేదులే! ఆ చిల్లర డబ్బులు నువ్వే తీసుకో!" అన్నాను.

"వద్దు సామీ! వద్దు. సెమటోడిస్తేనే సేతికి దక్కేది అంతంత మాత్రంగా ఉండాది. ఇంక ఉద్దరదుడ్లు ఈ బతుకులు అరిగించుకోలేవయ్యా!" అంటూ ఆ చిల్లర డబ్బులు– అదే డెబ్బయి పైసలు నాచేత పెట్టూ చేతులెత్తి నమస్కరించాడు.

ఆపని చేయాల్సింది ఎవరు?

నేనూ– నా తర్వాత తాలూకా ఆఫీసులో గుమాస్తా! నా స్వార్థంతో ముడిపడిన పర్మిట్‌కోసరం లంచం ఇచ్చిన నేను... ఇస్తేకానీ పర్మిట్ చేతికివ్వని గుమస్తా. ఇద్దరూ వాడిముందు ఏమయ్యాం?

అదే ఆలోచిస్తూ ఒకసారి వాడివైపు చూశాను. చూడలేక చూపులు మళ్లితే కొండల వెనుక పడబోతున్న సూర్యుడు పడమటి దిక్కును అరుణ రాగరంజితం చేస్తున్నాడు. స్వర్ణముఖినది గట్టున పార్కులో నెమలి పురులువిప్పి ఆడుతూ ఉంది. పూబాలలు గాలి తాకిడికి వయ్యారాలు పోతున్నాయి. స్వర్ణముఖి నదిలో అక్కడక్కడ గుంతల్లో నిలిచిన నీళ్ళు బంగారు కరగించి పోసినట్లుంది. శ్రీకాళహస్తీశ్వరుని ఆలయ గాలిగోపురం సంజ వెలుగులో ధవళ శిఖరంలా వెలిగిపోతూ ఉంది. ఆ సమయంలో లోకమే అందంగా ఉంది. ఆస్వాదించే శక్తిని పోగొట్టుకున్న మనసు మరలా ఒకసారి వాడివైపు మళ్లింది. అదే మాసిన గడ్డం. అదే చిరిగిన చొక్కా. అదే దిబ్బలాంటి తలమీద కుళ్ళాయి. అదే చెమట కంపు!....

అయితే!..... ఆ సంజవెలుగులో అన్నిటికంటే నా కంటికి వాడే అందంగా కనిపిస్తున్నాడు. నా ఆనందానికి రెక్కలొస్తే అదిగాలిగోపురం చుట్టూ ఎగిరే పావురాళ్లతో పోటీపడ్తూ ఉంది!

మనస్సుకు కన్నులుండి గుర్తించ కలగాలే కానీ ఈ సృష్టిలో కంటికి కనిపించని ఇలాంటి అందాలు ఎన్నో? ●

ఆంధ్రప్రభ
(7, జూలై 1977)